క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



పెనమలూరు: గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు వివరాలు తెలుపుతూ మండలంలో పెనమలూరు గ్రామ పంచాయతీ ఉత్తమ పారిశుద్ధ్యం పంచాయతీగా ప్రథమ స్థానం వచ్చిందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల్లో మహిళలకు రెండు జతల చీరలు, పురుషులకు రెండు ప్యాంట్లు, రెండు షర్టులు అందచేశామన్నారు. రానున్న కాలంలో కూడా కార్మికులు పారిశుద్ధ్య నిర్వహణలో ముందుండి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, గుమస్తా వాసుదేవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు చిరు వ్యాపారులకు సాయం



పెనమలూరు: కానూరులో ఇద్దర చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సాయం అందించారు. గ్రామంలో కామయ్యతోపునకు చెందిన ఎం.తిరుపతమ్మకు టిఫిన్ బండి, షేక్. ఆశాకు ఇస్త్రీ బండి వితరణగా ఇవ్వగా వైఎస్సార్ సీపీ నాయకుడు తుమ్మల వరదీష్ ఇద్దరు చిరు వ్యాపారులకు బుధవారం బండ్లు అందచేశారు. ఎమ్మెల్యే పార్థసారథి చిరు వ్యాపారులకు అండదండలుగా ఉండి వారి జీవనోపాధికి తన వంతు సాయం అందిస్తున్నారన్నారు.

రేపు పేరంటాలమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 28న వైశాఖమాసం సందర్భంగా అమ్మవార్లకు విశేష లక్ష పుష్పార్చన (మల్లెపూలతో) నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఈ లక్ష పుష్పార్చనకు పుష్పాలు ఇవ్వదలచిన భక్తులు శుక్రవారం ఉదయం ఆలయంలో అందజేయాలని సూచించారు. భక్తులు పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం



కంకిపాడు: రీ సర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తహసీల్దార్ టీవీ సతీష్ అన్నారు. మండలంలోని పునాదిపాడు సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం గొల్లగూడెంలో సర్వే రాళ్ల పాతే ప్రక్రియను తనిఖీ చేశారు. తహసీల్దార్ టీవీ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యను పరిష్కరించేందుకు రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. అపోహలు విడనాడి ప్రతి ఒక్కరూ రీ సర్వేలో భాగం కావాలన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, సర్వే రాళ్ల పాతే ప్రక్రియ శరవేగంగా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్వేయరు భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు మల్లికార్జునరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

గ్రూప్-1,2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించనున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మే 7 వ తేదీ ఆదివారం ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి గ్రూప్-1, 2 పరీక్షలకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తామని, రిజిస్ట్రేషన్, సిలబస్ వివరాలకు 91332 37733, 91336 37733 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కృష్ణా జిల్లా కో-కన్వీనర్‌గా మండంలోని ముస్తాబాదకు చెందిన చోడవరపు వెంకటేశ్వరరావు మాదిగను నియమిస్తూ ఉమ్మడి కృష్ణా జిల్లా ఇన్‌చార్జి లాం దానియేలు మాదిగ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నెల 25న చల్లపల్లిలో జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మండల, గ్రామాలకు బలమైన కమిటీలను నియమిస్తామని వెంకటేశ్వరరావు చెప్పారు.

కంకిపాడులో ప్రగతి పరుగులు

- శరవేగంగా సాగుతున్న మౌలిక వసతుల కల్పన
- సమకూరుతున్న ప్రభుత్వ భవనాలు
- ప్రజలకు మెరుగ్గా సేవలు
- రూ.6.51 కోట్ల నిధులు వెచ్చింపు



కంకిపాడు సచివాలయ భవనం



ఒకే ప్రాంగణంలో ఆర్‌బీకే వెల్‌నెస్ సెంటర్

కంకిపాడు: పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. మౌలిక వసతుల కల్పన శరవేగంగా సాగుతోంది. ప్రాధాన్యతా క్రమంలో అవసరమైన అభివృద్ధి చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించటంతో పట్టణం ప్రగతి పథంలో సాగుతోంది.

అభివృద్ధికి రూ.6.51 కోట్లు వెచ్చింపు....

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుంది. సంక్షేమ పథకాల అమలుతో పాటుగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకురావటంతో ఆయా ప్రాంతాల వారీగా సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటరు, బీఎంసీ సెంటర్లు అందుబాటులోకి వస్తున్నాయి. పట్టణంలోని 16 వార్డుల్లో ప్రభుత్వం ఏర్పడిన తరువాత, పట్టణ పాలకవర్గం పగ్గాలు చేపట్టాక ఇప్పటి వరకూ అభివృద్ధి పనులకు రూ. 6.51 కోట్లు కేటాయింపులు చేశారు. వీటిలో పలు పనులు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

సమకూరుతున్న భవనాలు....

పట్టణంలోని మూడో సచివాలయం నిర్మాణం జరిగింది. దీంతో పాటుగా రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు పూర్తి చేశారు. సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలు కూడా అందుతున్నాయి. వీటి కోసం రూ.80 లక్షలు వెచ్చించారు. సచివాలయం 1, 2 పరిధిలో రూ.1.50 కోట్ల వ్యయంతో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్, బీఎంసీ సెంటర్ నిర్మాణం చేపట్టారు. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనగుణంగా ప్రజలకు మెరుగైన సేవలను సచివాలయాల సిబ్బంది అందిస్తున్నారు.

తాగునీటి వసతులకు ప్రాధాన్యం....

పట్టణ ప్రజల తాగునీటి అవసరాల రీత్యా పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకుంటోంది. అవసరమైన చోట్ల పైపులైను విస్తరణ, బోర్లు ఏర్పాటు పనులు చేపడుతోంది. వెల్‌నెస్, ఆర్‌బీకే సెంటర్లలో నీటి వసతి కోసం రూ. 11 లక్షలు వెచ్చించారు. జలజీవన్ మిషన్ కింద గ్రామానికి ఇంటింటికీ కుళాయి, పైపులైను విస్తరణ పనులు, మంచినీటి ట్యాంకు నిర్మాణాలకు రూ.2.37 కోట్లు మంజూరు చేశారు. పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. గ్రామంలోని అంతర్గత రహదారులు, అప్రోచ్ రోడ్లు, సీసీ డ్రెయిన్ల ఏర్పాటు వంటి చర్యలతో మౌలిక వసతుల కల్పన పనులను, పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్నారు.

లాకురోడ్డు అభివృద్ధికి చర్యలు...

దీర్ఘకాలంగా లాకురోడ్డు అభివృద్ధికి నోచలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా పరిషత్ నిధులు రూ.50 లక్షలు వ్యయంతో లాకురోడ్డును అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించారు. తొలిదశ పనులు పూర్తయ్యాయి. సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసే పనులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే దీర్ఘకాలిక ఇక్కట్లకు తెరపడినట్లవుతుంది.

సమగ్రాభివృద్ధికి చర్యలు



ప్రభుత్వం, జిల్లా పరిషత్, మండల పరిషత్, స్థానిక సంస్థల నిధులతో గ్రామంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నాం. మౌలిక వసతుల కల్పనలో రాజీ పడటం లేదు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూస్తున్నాం. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దటం కోసం కృషి చేస్తున్నాం.

– బాకీ రమణ, సర్పంచ్, కంకిపాడు

సమష్టి కృషితో అభివృద్ధి



ఎమ్మెల్యే పార్థసారథి సహకారం, అన్ని శాఖలూ, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషి, భాగస్వామ్యంతో గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెండింగ్ పనులపై దృష్టి పెట్టాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మరింత బాధ్యతగా పనిచేస్తాం.

– రాచూరి చిరంజీవి, ఉపసర్పంచ్, కంకిపాడు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ నుంచి రైవస్ కాలువ వరకు మండల నిధులు రూ.57 లక్షలతో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను బుధవారం ఎంపీటీసీ, వార్డు సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ రహదారిని 20 అడుగుల వెడల్పు, 540 మీటర్ల పొడవుతో అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఒక వైపు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో మరో వైపు రహదారి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రహదారిలో పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో కల్వర్టు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రూ. 5 లక్షలతో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ డబుల్‌లైన్ రహదారి నిర్మాణానికి మరో వైపు రూ.57 లక్షలతో అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. పంచాయతీ నిధులు మరో రూ.8లక్షలతో ఈ రహదారి మధ్యలో డివైడర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్, మాదు సుబ్బారావు, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై ఇద్దరు వ్యక్తుల దాడి

పెనమలూరు: కానూరులో మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు బీఎస్ఎన్ఎల్ కాలనీలో ఉంటున్న మన్నే త్రివేణికి భర్తతో విభేదాలు ఉండటంతో ఇద్దరు పిల్లలతో వేరుగా ఉంటుంది. ఆమెకు గత కొద్దికాలంగా రవీంద్రబాబుతో పరిచయం ఉంది. అయితే త్రివేణి పై రవీంద్రబాబు అనుమానం పెంచుకుని గొడవపడ సాగాడు. ఈ నేపథ్యంలో రవీంద్రబాబు అతని మిత్రుడు వడ్లమూడి వంశీ కలిసి త్రివేణి ఇంటికి వచ్చి గొడవపడి ఆమె పై దాడి చేశారు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

యువత క్రీడారంగంలో రాణించాలి



కానూరులో క్రీడాకారులకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ పి.అంకమ్మ చౌదరి

పెనమలూరు: యువత క్రీడారంగంలో రాణించి దేశానికి గుర్తింపు తీసుకురావాలని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం 16వ క్రీడాదినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో యువత ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తెలిపారు. యువత క్రీడారంగం పై దృష్టిపెట్టి క్రీడల్లో సత్తాచాటాలన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకుంటే క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థానంలోకి ఎదుగుతామన్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, పీడీ వైవీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ మధులత, డాక్టర్ నీలాంబరి తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోరంకికి చెందిన టి. గీతాంజలి గత రెండు సంవత్సరాల క్రితం అదే ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌తో పరస్పరం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో వరకట్నం ఇవ్వలేదని, ఇప్పుడు తీసుకురమ్మని భర్తతో పాటు అత్త రమణకుమారి, మామ మల్లేశ్వరరావు, మరిది నవీన్‌కుమార్ వేధింపులకు గురి చేయసాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటివారి పై వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్.ఆర్.ప్రసాద్

కంకిపాడు: నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ప్రగతి సాధించాలని డీఆర్‌డీఏ కృష్ణా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్.ఆర్.ప్రసాద్ అన్నారు. లోకాస్ యాప్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. వర్క్‌షాప్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్ హాజరై సూచనలు ఇచ్చారు. యాప్‌లో ప్రజలు లబ్ధి పొందుతున్న ఆర్థిక వివరాలను నమోదు చేయాలన్నారు. సేవలు పారదర్శకంగా ఉండాలన్నారు. అభియోగాలకు ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లే అవుట్ల ఇళ్ల నిర్మాణాలను లక్ష్యం మేరకు పూర్తయ్యేలా బాధ్యతతో పనిచేయాలన్నారు. వారం వారం ప్రగతి నివేదికలను రూపొందించి నివేదించాలన్నారు. లక్ష్యాలను చేరుకోకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ ఈ.రంగారావు, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ శ్రీలక్ష్మి శిక్షణ ఇచ్చారు.

ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

కంకిపాడు: రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాజకీయాలకు తావులేకుండా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేస్తూ దేశంలో స్ఫూర్తిదాయకంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, డైరెక్టర్ జొన్నలగడ్డ నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

గన్నవరం రూరల్: పారదర్శకంగా ఉపాధి హామీ పనులు జరగాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం మండలంలోని సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లు, కొలతలు రికార్డులను పరిశీలించారు. కూలీలు ప్రతిరోజు ఉదయం 6 గంటలకే పనులకు రావాలని సూచించారు. రోజుకు కూలీ రూ.272 వస్తుందని తెలిపారు. ఏపీవో సత్యప్రియ, ఎఫ్ఏ స్వాతి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీభవిష్య విద్యార్థుల ప్రతిభ



466 మార్కులు పొందిన బి.అమృత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శ్రీ భవిష్య జూనియర్ కళాశాల డైరెక్టర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బాన అమృత, శీలం వైష్ణవి 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించారని, 460 మార్కులకు పైగా 19 మంది విద్యార్థులు సాధించారని తెలియజేశారు. బైపీసీ విభాగంలో గీతాశ్రీ 440 మార్కులకు గాను 436 మార్కులు పొందిందని, 430కి పైగా మార్కులను 21 మంది విద్యార్థులు సాధించారని తెలియజేశారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో జి.సత్య లిఖితారెడ్డి, లక్ష్మీ చర్విత వెయ్యి మార్కులకు 986 మార్కులు పొందారని తెలిపారు. 980 మార్కులకు పైగా 10 మంది, 970 మార్కులకు పైగా 31 మంది, 950కి పైగా మార్కులను 68 మంది విద్యార్థులు పొందారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

గన్నవరం డీఎస్పీ విజయపాల్ బదిలీ

గన్నవరం: డీఎస్పీ కె. విజయపాల్ బదిలీ అయ్యారు. గతంలో రెండేళ్ల పాటు విజయవాడ ఈస్ట్‌జోన్ ఏసీపీగా, జిల్లాల విభజన తర్వాత కృష్ణా జిల్లా ఎస్పీ పరిధిలోకి వచ్చిన గన్నవరం సబ్ డివిజన్‌కు డీఎస్పీగా ఆయన కొనసాగారు. ఇక్కడ సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన విజయపాల్‌ను రాజమండ్రి సెంట్రల్ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్‌జీ జయసూర్యను నియమించారు.

ఇఫ్‌కో నానో డీఏపీతో రైతులకు ప్రయోజనం

ఉంగుటూరు: ఇఫ్‌కో నానో డీఏపీ ప్రవేశంతో రైతన్నలకు పెట్టుబడి భారం తగ్గుతుందని ఇఫ్‌కో జిల్లా మేనేజర్ నందకిషోర్‌రెడ్డి అన్నారు. కేంద్ర హోం, సహకార మంత్రి అమీత్‌షా చేతులమీదుగా ఢిల్లీలో జరిగిన నానో డీఏపీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పొనుకుమాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులు టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో డీఏపీ ఎకరానికి అధిక దిగుబడులు రావడంతోపాటు పెట్టుబడి భారం తగ్గుతుందని పేర్కొన్నారు. దీని ధరం రూ.600కి మార్కెట్‌లోకి రానుందని చెప్పారు. రైతులకు సలహాలు, సందేహాలను మేనేజర్ నివృత్తి చేశారు. సీఈవో భువనం రాఘవయ్య, రైతులు పాల్గొన్నారు.

అన్ని వసతుల కల్పనకు చర్యలు



చిన ఓగిరాలలో గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తే అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కె.పి.సారథి అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లు అందించారు. జగనన్న లే అవుట్‌ను సందర్శించి ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ 9 ఎకరాల్లో 348 మంది పేదలకు పట్టాలు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మాణం ప్రారంభిస్తే అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే కొలమానంగా పేదలందరికీ గూడు ఏర్పాటుచేస్తున్నారని చెప్పారు. స్థలం ఇచ్చి, ఇళ్లు మంజూరు చేసి అన్ని వసతులతో శంకుస్థాపనలు జరిగేలా చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చీలి కల్పన, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, నాయకులు గారపాటి నాని, మంచిగంటి రమేష్, మత్తే ఉదయభాను, బోలెం నాగబాబు, వీరయ్య, ఎంపీడీఓ విమాదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి గీతామందిర వార్షికోత్సవం



అలంకరణలో షిరిడీ సాయిబాబా



అన్నసమారధనలో పాల్గొన్న భక్తులు

పెనమలూరు: కానూరులో సాయిగీతామందిరంలో షిరిడీ సాయిబాబా 23వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతితో పూజలు ప్రారంభించారు. 6.10 గంటలకు ఆవుపాలతో బాబాకు అభిషేకం చేశారు. 8.30 గంటలకు పల్లకీ పూజ చేశారు.10 గంటలకు మల్లెలార్చన చేసి అనంతరం హారతి ఇచ్చారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగా దాదాపు ఏడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

నిర్మల శిశుభవన్‌కు కల్యాణమయి తోడ్పాటు



చిన్నారులతో ముచ్చటిస్తున్న గ్రూపు సభ్యులు

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన కల్యాణమయి మహిళా సభ్యులు బుధవారం విజయవాడలోని కృష్ణలంకలో ఉన్న నిర్మల శిశుభవన్‌ను సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల ఆహార అవసరాల నిమిత్తం సుమారు రూ. 16 వేలు విలువైన నిత్యావసర సరుకులను అందజేసినట్లు కల్యాణమయి అధ్యక్షురాలు మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించడంతో పాటు వారి యోగక్షేమాలను శిశుభవన్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో అనాథలు, అభాగ్యుల అభ్యున్నతికి కల్యాణమయి తమవంతు సాయం అందజేస్తుందని తెలిపారు. వీరికి ఆశ్రయం కల్పించే స్వచ్ఛంద సంస్థలకు బాసటగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉయ్యూరు: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కె.పి.సారథి అన్నారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో గారపాటి బాబూరావు మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వేసవిలో యువత సమయాన్ని వృథా చేయకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, పార్టీ మండలప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు మెరుగుమాల ఏసుబాబు, రమావత్ శ్రీకాంత్, ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి అభినందనలు



పెదపులిపాకలో సిబ్బందిని అభినందించిన సర్పంచి శ్రీనివాసచౌదరి

పెనమలూరు: పెదపులిపాక గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది, కార్మికులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి గ్రామ పంచాయతీ ప్రతిష్ట పెంచారని సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత గుంటూరు శ్రీనివాసచౌదరి కొనియాడారు. గ్రామంలో బుధవారం సిబ్బంది అభినందన సభలో ఆయన మాట్లాడారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలో అధికారులు వివిధ విభాగాల్లో ప్రకటించిన 9 అంశాల్లో 9 అవార్డులు గ్రామ పంచాయతీ గెలిచిందన్నారు. దీనికి సిబ్బంది, వలంటీర్లు, కార్మికులు చేసిన కృషే నన్నారు. భవిష్యత్తులో గ్రామ పంచాయతీ ప్రతిష్ట మరింత పెంచి ప్రజలకు ఉత్తమ సేవలు అందించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో వి.పద్మావతి, వైద్య విభాగం సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

గన్నవరం: బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుడిగా ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శేషుకుమార్ నేతృత్వంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా ఎ.తిరుపతయ్య, ఎస్‌కె. బాజీ, ప్రధాన కార్యదర్శులుగా పి. శ్రీనివాసరావు, ఎ.రాజశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా కె. దుర్గారావు, ఎ.జగపతిబాబు, ఎస్‌కె. జహంగీర్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా కె. దుర్గ, పి. సురేష్ ఎన్నికయ్యారు. నియోజకవర్గ నేతలు శ్రీనివాసరావు, భక్తవత్సలం, అరవింద్ తదితరులున్నారు.